గురుకుల పాఠశాలల టైంటేబుల్ మార్చాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని, పాఠశాలల టైంటేబుల్ మార్చాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వాన్ని కోరారు. గురుకులాల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని, బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, ప్రధాన కార్యదర్శి జావిద్, జిల్లా కార్యదర్శి రాజ్యలక్ష్మి లకన్‌బాబు పాల్గొన్నారు.

నగరంలో నల్లాల సర్వే



- నోటీసుల జారీతో కలకలం
- ఇదేమి బాదుడు అంటున్న నగరవాసులు
- బయటపడుతున్న అక్రమ నల్లా కనెక్షన్లు
- గతంలో బిల్లులు చెల్లించినా ఆన్‌లైన్ కాని వైనం

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో నల్లాల కనెక్షన్ల సర్వే కలకలం రేపుతోంది. అక్రమ నల్లాల క్రమబద్ధీకరణకు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంటింటి సర్వే జరుపాలని, పాసుబుక్‌లు లేని వారికి నోటీసులు జారీ చేసి సరైన పత్రాలను సమర్పిం చకుంటే సక్రమం చేసుకునేందుకు ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు. ఎన్ని ఇంచులకు డిపాజిట్ చెల్లించారు.. ఎన్ని ఇంచుల కనెక్షన్‌తో నీటిని పొందుతున్నారనే వాటిని కూడా పరిశీలించాలన్నారు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు ఇంటింటికి వెళ్లి నల్లా సర్వే ప్రారంభించారు. గతంలో నల్లా కనెక్షన్ కోసం చెల్లించే డిపాజిట్‌తోపాటు నెలసరి బిల్లులను కూడా ఆఫ్‌లైన్‌లోనే చెల్లించి పాసుబుక్కులో రాయడం, రశీదులు తీసుకోవడం జరుగుతుండేది. ప్రస్తుతం ఆఫ్‌లైన్ విధానాన్ని పూర్తిగా తొలగించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి కనెక్షన్లు ఇస్తున్నారు. నెలవారీ బిల్లులను కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని సూచిస్తున్నారు. గతంలో చాలా మంది పాసు బుక్‌లోని ట్యాప్ నంబర్ ప్రకారం నెలసరి బిల్లులను చెల్లించినా వారి పేర్లు, ఆ ట్యాప్ నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో వారిని ఆన్‌లైన్ చేసుకోవాలని సూచిస్తుండడంతో ఇప్పటి వరకు నెల వారీ బిల్లులు చెల్లించామని చెప్పినా బకాయిలను చెల్లించాలంటూ నోటీసులు జారీ చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్లకు పెరిగిన బిల్లులు

25లోపు ప్లాట్లు ఉన్న అపార్టుమెంట్లకు గతంలో 1,75,000 రూపాయలను డిపాజిట్‌గా తీసుకొని కమర్షియల్‌గా ముప్పావు ఇంచు నల్లాపైపులైన్‌తో కనెక్షన్ ఇచ్చే వారు. మొత్తం అపార్టుమెంట్లలో ఎన్ని ప్లాట్లు ఉన్నా నెలకు 750 నుంచి 900 రూపాయల వరకు బిల్లులను తీసుకున్నారు. అలాంటి వారందరికి ఇప్పుడు నోటీసులు జారీచేశారు. ఒక్కో ప్లాట్‌కు నెలకు 120 చొప్పున 25 ప్లాట్లు ఉంటే మూడు వేల రూపాయల బిల్లులను చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారు. అర ఇంచు పైపులైన్‌తో ఇళ్లకు కనెక్షన్లు ఇస్తూ నెలకు 100 రూపాయలు వసూలు చేస్తున్నారని, అపార్టుమెంట్ మొత్తానికి ముప్పావు ఇంచు నల్లా కనెక్షన్ ఇచ్చి మూడు వేలు చెల్లించాలనడం ఎంత వరకు సమంజమని అంటున్నారు.

ప్లాట్ వైజ్‌గా నల్లాబిల్లులు వసూలు చేస్తే మరి అన్నింటికి అర ఇంచు సైజుతో నల్లా కనెక్షన్ ఇస్తారా ఇస్తే నెలకు 100 రూపాయలు చెల్లిస్తామని చెబుతున్నారు. కొన్ని చోట్ల హాఫ్ ఇంచు కనెక్షన్ తీసుకొని ముప్పావు ఇంచు, మరికొన్ని చోట్ల ఇంచుతో ఉన్న కనెక్షన్లు బయటపడుతుండడంతో వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఇళ్లకు వెళ్లి పాసు బుక్కులు లేని వారు ఇప్పటి వరకు చెల్లించిన డబ్బులతో సంబంధం లేకుండా బకాయిలన్నింటిని మిగతా 8వ పేజీలో..



అధికారులు, చిన్నారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బాలల దినో త్సవం వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అన్నారు. స్నేహిత కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్ర మాలు ఏర్పాటు చేస్తూ బాలల హక్కులను వివరిస్తున్నామని అన్నారు.

బాలబాలికలు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా 1098 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏమైనా వేధింపులు, ఇతరత్రా సమస్యలుంటే పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెల ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించా రు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లుగా సమాచా రముంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలు పొందిన విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సైన్ లాంగ్వేజీలో జాతీయ గేయం పాడిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన ప్రభుత్వ క్రీడా పాఠశాలల విద్యార్థులను అభినందించారు. పిల్లల దత్తతకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి బాలల హక్కుల పరిరక్షణకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గంగాధర్, మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారి

'స్థానిక' ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని

కరీంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్సు ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థ వంతంగా అమలు చేసేందుకు పరిశీలకులకు శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా స్థాయి లో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, డీఆర్వో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో జగదీశ్వర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న వైపు.. రైతుల చూపు

పత్తి దెబ్బతినడంతో ఆరు తడి పంటల సాగుకు మొగ్గు

హుజూరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానా కాలంలో అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిని.. అనుకున్న దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. పత్తి సరిగ్గా పండకపోవడంతో ఇతర పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. గత సంవత్సరం పత్తి ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ సారి అందులో సగం కూడా రాలేదని రైతులు అంటున్నారు. పత్తి పూత, కాత దశలో భారీ వర్షాలు కురవడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఉన్న పత్తిని ఎరుకుందామనుకుంటే కూలీలకు రేట్లు పెంచడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

ఈ వర్షాలతో భూ గర్భ జలాలు పెరగడంతో పత్తిని తొలగించి యాసంగిలో మొక్క జొన్న సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. క్వింటాల్ మక్కలకు వరి ధాన్యానికి సమానంగా ధర ఉండడంతో మొక్కజొన్న పంట లను వేస్తున్నారు. మక్కలకు క్వింటాల్ ప్రభుత్వ మద్దతు ధర 2,400 రూపాయలు ఉంది. హుజూరాబాద్ డివిజన్‌లో ఇప్పటికే మొక్కజొన్న నాటేందుకు కూలీలతో విత్తనాలు వేయిస్తున్నారు. దీంతో ట్రాక్టర్లతో, రోటావేటర్‌లతో భూములను చదును చేయించి అచ్చు తోలి నీరు పారే విధంగా సాళ్లు చేస్తున్నారు. ఆడ, మగ మొక్కజొన్న పంట వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- **డివిజన్‌లో పంటల వివరాలు**

డివిజన్‌లో హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉన్నాయి. 1.2 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో యాసగింలో సుమారు 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న విత్తనాలు పెట్టారు. మొక్కజొన్న సాగు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.





హుజూరాబాద్ మండలం నర్సింగాపూర్‌లో దేనును దున్నుతున్న రైతు, కాట్రపల్లిలో మొక్కజొన్న విత్తనాలను నాటుతున్న మహిళలు

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

వారోత్సవాల ముగింపులో చైర్మన్ సత్తు మల్లయ్య



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య

కరీంనగర్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని గ్రంథాలయాలను యువత వినియోగించుకుని ఉన్నత ప్రతిభావంతులుగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు, పాఠకుల కోసం మరిన్ని పుస్తకాలు తెప్పిస్తామని అన్నారు. నిష్ణాతులతో కోచింగ్, ఉపన్యాసాలు ఇప్పిస్తామని తెలిపారు. వారానికొకసారైనా గ్రంథాలయాన్ని సంద ర్శించి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మెరుగైన వసతుల రూపకల్పనపై దృష్టి సారించామని తెలిపారు. అంతకు ముందు కవి అన్నవరం దేవేందర్ తన పుస్తకాలను ఆవిష్కరింపజేసి గ్రంథాలయానికి అందజేశారు. అనంతరం టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, నాయకులు సంగెం లక్ష్మణరావు, హర్మిందర్‌సింగ్, ఎం కిరణ్‌కుమార్ మాట్లాడారు. గ్రేడ్-3 లైబ్రేరియన్ పి నాగభూషణం నివేదిక సమర్పించారు. అనంతరం వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. సంస్థ కార్యదర్శి ఎ సరిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 లైబ్రేరియన్ వి అర్జున్, గ్రేడ్-3 లైబ్రేరియన్ జి సరిత, జూనియర్ అసిస్టెంట్ కె మల్లయ్య, రికార్డ్ అసిస్టెంట్ జె గౌతమి పాల్గొన్నారు.

ఎండిన వరి

హార్వెస్టర్ల కొరతతో కోతల్లో జాప్యం



రాఘువాపూర్‌లో ఎండిన వరి పైరు

మానకొండూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఎల్‌ఎండీ నుంచి సాగు నీరు అందడం, గ్రామాలలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో ఆరు తడి పంటలపై రైతులు ఆసక్తిని చూపడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలన్నీ నేలవాలాయి. నెల రోజుల క్రితమే పొలాలు కోతకు వచ్చినా వర్షాలతో పొలాల్లో నీరు ఉండడంతో కోయడానికి వీలు లేకుండా పోయింది. ప్రస్తుతం పొలాల్లో నీరు తగ్గినా బురద ఉండడంతో సాధారణ హార్వెస్టర్లతో కోత సాధ్యం కావడం లేదు. దీంతో ట్రాక్ హార్వెస్టర్లపై రైతులు ఆధారపడుతున్నారు. గ్రామానికి ఒకటి, రెండు ట్రాక్ హార్వెస్టర్లు ఉన్నాయి. అవి తీరికలేకుండా పని చేస్తున్నా మండలంలో 30 శాతం కోతలు కూడా పూర్తి కాలేదు. ట్రాక్ హార్వెస్టర్లకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో గంటకు 3,500 రూపాయలు వసూలు చేస్తున్నారు. వరి కోతల్లో జాప్యం జరుగుతుండడంతో గొలుసులు విరిగి రైతులకు నష్టం వాటిల్లుతోంది.

మావోయిస్టులను హతమార్చడం దుర్మార్గం

- **సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి**

చిగురుమామిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై అవగాహన లేకుండా ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను హతమార్చడం దుర్మార్గమని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముస్కురాజిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని రాష్ట్ర ప్రజలు ఎండగట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ ప్రజల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. ఈ నెల 26న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ వందేళ్ల ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్న స్వామి, రాకం అంజవ్వ, బూడిద సదాశివ, సింగిల్ విండో డైరెక్టర్లు ముద్రకోల రాజయ్య, మాజీ సర్పంచ్‌లు గోళి బాపురెడ్డి, మావురపు రాజు, తెరాల సత్యనారయణ, బోయిని పటేల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

పరిశ్రమల అభివృద్ధికి 'ఉద్యమ్'
● బ్యాంకు రుణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి 6

బీజేపీలో విభేదాలు లేవు
● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ 7

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం
● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి 8

రాజీవ్ రహదారిపై పోలీస్ మ్యాన్

ప్రమాదాల నియంత్రణకు డమ్మీ బొమ్మలు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాలు పెరిగి పోతున్నాయి. మండలంలోని రేణికుంట నుంచి అలుగునూర్ వరకు ప్రతి రోజు రోడ్డు ప్రమా దాలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతంలో మూల మలుపులు, రహదారిని ఆనుకుని చాలా గ్రామాలున్నాయి. మూల మలుపుల వద్ద రోడ్డు దాటుతున్న సమయాల్లో ప్రమాదా లు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఆలోచనతో సీపీ గౌస్‌ఆలం సూచ న మేరకు ఎల్‌ఎండీ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎల్‌ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరిగే జంక్షన్లలో, మూల మలు పుల వద్ద వాహనాల వేగాన్ని నిరోధించేందుకు 30 స్టాపర్లను ఏర్పాటు చేశారు. అచ్చం ట్రాఫిక్ పోలీసుల్లా ఉండే ఆరు పోలీస్ మ్యాన్ డమ్మీ బొమ్మలను ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. స్టాపర్లపై రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పొందపర్చారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదిం చాల్సిన నంబర్లను రాయించారు.



రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేస్తున్న పోలీస్ మాన్ బొమ్మలు

ప్రమాదాల నివారణకు చర్యలు : శ్రీకాంత్ గౌడ్, ఎల్‌ఎండీ ఎస్ఐ

ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. సీపీ సూచన మేరకు 30 స్టాపర్లను తయారు చేయించి ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. ఆరు పోలీస్ మ్యాన్ డమ్మీ బొమ్మలను ఏర్పాటు చేశాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ నిర్దేశిత వేగంలో వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి.



మద్యం మత్తులో యువకుడి హంగామా

● ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం



ఒంటిపై గాయాలతో సాయికుమార్

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు మండల కేంద్రంలో హంగామా సృష్టించాడు. మండేపల్లి మూలమలుపు వద్ద తంగళ్లపల్లికి చెందిన సాయికుమార్ కుటుంబ కలహాలతో మద్యం మత్తులో కత్తితో ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని ఆసుపత్రికి తరలించారు.

పార్వతీపురం పోలీస్ క్వార్టర్‌లో నాగుపాము కలకలం



నాగుపాము పడుతున్న జగదీష్

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వెనుకవైపు ఉన్న పార్వతీపురం పోలీస్‌క్వార్టర్‌లో గురువారం రాత్రి నాగుపాము దూరి కలకలం సృష్టించింది. ఆలయ పార్వతీపురం 13ఏలో ఆలయభద్రతా సిబ్బంది నివాసం ఉంటారు. ఈ పోలీస్‌క్వార్టర్‌లో అయిదు అడుగులనాగుపాము ప్రత్యక్షమైంది. ఇదిచూసిన భద్రతాసిబ్బంది స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించారు. అతను వచ్చి పామునుపట్టి దూరంలో వదిలిపెట్టాడు.

కొండచిలువ హతం



గర్రెపల్లిలో కొండ చిలువ

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిచెరువు సమీపంలోని వైకుంఠ ధామం వద్ద రహదారిపై రైతులకు కొండ చిలువకనిపించింది. ఈదారివెంట వెళ్లా లంటే భయంగా ఉందని రైతులు పేర్కొన్నారు. గర్రెపల్లి మీదుగా గొల్లపెల్లి, సాంబయ్యపల్లి, నారాయణరావుపల్లి గ్రామాలకుచెందిన వారు ఈదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు కర్రలతో కొట్టడంతో చనిపోయింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామగుండానికి చెందిన ఆకుల శివకుమార్ అనేవ్యక్తి అక్టోబరు 26న తన సెల్‌ఫోన్‌ను ఆరెపల్లి వద్ద పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ సెల్‌ఫోన్ హైదరాబాద్‌లో ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని గురువారం రూరల్ స్టేషన్‌కు పిలిచి సీఐ ఏ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

పరిశ్రమల అభివృద్ధికి ఉద్యమ్

● బ్యాంకు రుణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఉద్యమ్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపార రంగంలో స్థిరపడేందుకు బ్యాంకులు రుణాలు అందజేస్తుంటాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉంటేనే బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సంస్థల అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. తక్కువ వడ్డీ ప్రయోజనాలు కలిగిన ఉన్న వివిధ పథకాలు, గ్యారంటీ లేని రుణాల కోసం ఉద్యమ్ పోర్టల్‌లో తప్పనిసరంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ప్రయోజనాలు...

ప్రభుత్వ పథకాల ద్వారా నిరుద్యోగులు, వ్యాపారులు పొందే రుణాల్లో వడ్డీ రాయితీ, గ్యారంటీ లేకుండా రుణం పొందే అవకాశం, తక్కువ వడ్డీకే రుణాల లాంటి ప్రయోజనాలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో కలుగుతాయి. ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ద్వారా అందించే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కాగిత రహితంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో జరిగే ప్రక్రియ. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం యూఆర్ఎన్ నంబర్‌తో కూడిన ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. సంస్థకు ఒక శాశ్వత సంఖ్యతో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ఆధార్, పాన్ లింకు కలిగి ఉండి, పట్టణాల్లో అయితే స్ట్రీట్ వెండర్లకు, ముద్ర రుణాల దర ఖాస్తుదారులకు, పరిశ్రమలు, సేవా రంగంలో వ్యాపారం కోసం పీఎంఈజీపీ లాంటి పథకాలలో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని బ్యాంకు అధికారులు చెప్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఇలా...

www.udyamregistration.gov.inఅనే వెబ్‌సైట్‌లో ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. దానిలో ఆధార్ జూంబర్, పేరు నమోదు చేసి జనరేట్ చేయగానే ఆధార్ కార్డుకు లింకు ఉన్న మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేయగానే పాన్‌కార్డు నంబర్, వివరాలు అడుగుతుంది. పాన్‌కార్డు వివరాలు ఎంటర్ చేయగానే మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సామాజిక వర్గం, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకు వివరాలు, పెట్టుబడి వివరాలు నమోదు చేయాలి. అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. దరఖాస్తును సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్ (యూఆర్ఎన్) చూపిస్తుంది. నమోదు చేసిన మెయిల్ ఐడీ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టి ఫికెట్‌ను కేంద్ర ప్రభుత్వ ఎం ఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది.

లొంగుబాటలో మావోయిస్టు నేత మల్లా రాజిరెడ్డి?

● మంతనాలు జరుపుతున్న బంధుమిత్రులు

● రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం..



మల్లా రాజిరెడ్డి(ఫైల్)

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తెన్న లొంగుబాటుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు సమాచారం. లొంగుబాటు కోసం మార్గం సుగమమయ్యేందుకు ప్రభుత్వ పెద్దలతో రాజిరెడ్డి బంధు, మిత్రులు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ కగార్‌తో దండకారణ్యంలో చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్‌లు, పదులసంఖ్యలో అగ్రనేతలు మృత్యువాత, లొంగిపోయారు. ఈక్రమంలో రాజిరెడ్డి లొంగు బాటు కోసం వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో రాజిరెడ్డి లొంగుబాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మంథని మండలంలోని శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డి విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై దాదాపు 45ఏళ్లుగా పని చేస్తూ కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా 2007లో కేరళలోని ఎర్నాకుళంలో పోలీసులు అరెస్టు చేయగా మంథని, మెట్‌పల్లి కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించారు. కేసుల విచారణ అనంతరం బెయిల్ పై విడుదలైన రాజిరెడ్డి తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం..

● బట్టల షాపునకు నిప్పు పెట్టుకున్న యజమాని ● అగ్నిప్రమాదమంటూ పోలీసులకు ఫిర్యాదు

● కుట్రను ఛేదించి ముగ్గురిని అరెస్టు చేసిన త్రీటౌన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో ఈనెల 17న ఉదయం జరిగిన అగ్నిప్రమాదం కేసును త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం యజమాని ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని పోలీసులు గుర్తించారు. కరీంనగర్ త్రీటౌన్‌సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్ యజమాని సంగం రాజేశ్ వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పుల బాధతో ఇన్సూరెన్స్ డబ్బులు క్లెయిమ్‌చేసి బయటపడాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనవద్ద పనిచేసే రాకేశ్, మధుతో కలిసి కుట్రపన్నాడు. ఘటనకు ముందు షాపులోని విలువైన బట్టలను రహస్యంగా తరలించి, అనంతరం పెట్రోల్ పోసి షాపునకు నిప్పంటించారు. అనంతరం ఏమీ తెలియనట్లు రాజేశ్ డయల్ 100కు ఫోన్‌చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే షాపులో ఒక మూలన మాత్రమే బట్టలు కాలిపోయి ఉండటం, సీసీ కెమెరాల డీవీఆర్ కాలిపోవటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ జాన్‌రెడ్డికి అనుమానం కలిగింది. ఆ షాపులో సీసీ కెమెరాలను పరిశీలించేందుకు అవకాశం లేకుండా డీవీఆర్ కాలిపోయింది. దీంతో షాపు సమీపంలో, చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు షాపు యజమాని, వర్కర్, గుమాస్తాల కదలికలు అనుమానాస్పదంగా కలిపించాయి. దీంతో మరింత లోతుగా విచారణ జరిపి, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నేరానికి వాడిన పెట్రోల్‌బాటిల్, సెల్‌ఫోన్, షాపునుంచి తరలించిన బట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు సంగం రాజేశ్ (షాపు యజమాని), రాకేశ్ (వర్కర్), మధు (గుమస్తా)ను గురువారం అరెస్టు చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన ఒక మహిళపై అత్యాచారయత్నం కేసులో నేరం రుజువు కావడంతో ఆమె మామ అయిత చంద్రయ్యకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం గోదావరిఖని కోర్టు తీర్పునిచ్చింది. 2024 నవంబరు 27న తనపై అత్యాచారం చేశారంటూ బాధితురాలు గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ భూమేష్ కేసు నమోదు చేశారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, ఏపీపీ పద్మజ, అడిషనల్ జిల్లా, సెషన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా న్యాయమూర్తి శ్రీనివాసరావు దోషికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్

● కూలీలకు గాయాలు

బోయినపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో కూలీలకు గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నీలోజిపల్లి గ్రామానికి చెందిన కోనుకటి రవీందర్‌కు చెందిన ట్రాక్టర్‌ను కొత్తపేట గ్రామానికి చెందిన కోనుకటి తిరుపతి అద్దెకు తీసుకున్నాడు. గురువారం కూలీలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా డ్రైవర్ ఎర్రనాగరాజు కొత్తపేట ఎస్సీ కాలనీలో నిలిపాడు. వేములవాడకు చెందిన టిప్పర్ లారీని రెడ్డవేని జశ్వంత్ అనేవ్యక్తి నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి ట్రాక్టర్ ట్రైలర్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కూలీలు కుర్మ రాజవ్వ, ఎల్లండుల కమలవ్వ, ఎల్లండుల లచ్చవ్వ, కోనుకటి రమ్య, ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజు రోడ్డుపై పడిపోగా వారికిగాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రమాకాంత్ తెలిపారు.

మోసం చేసిన కేసులో వ్యాపారి అరెస్టు

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి మోసానికి పాల్పడిన గద్దలపల్లి లోని శ్రీలక్ష్మిప్రసన్న ఇండస్ట్రీస్ పార్ట్నర్ బైర్నేని వరప్రసాద్‌రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. 2023-24 సంవత్సరానికి చేసుకున్న ఒప్పందం ప్రకారం ఖరీఫ్‌సీజన్‌లో కొనుగోలు చేసిన వడ్లను రైస్‌మిల్లు ఇవ్వగా వారు 38,489క్వింటాళ్ల సివిల్‌సప్లై కార్పొరేషన్‌కు 25,680క్వింటాళ్ళ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా మిల్లు వ్యాపారులు వరప్రసాద్, తాటిపెల్లి శ్రీనివాస్‌లు అగ్రిమెంట్‌ను దుర్వినియోగం చేసి బియ్యాన్ని కార్పొరేషన్‌కు ఇవ్వకుండా రూ.12.37కోట్లు మోసం చేసినట్లు మేనేజర్ శ్రీకాంత్‌ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో తాటిపెల్లి శ్రీనివాస్‌ను అరెస్టు చేశామన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి



అభినవ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి గోవింద్ అభినవ్(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన అభినవ్ బద్దిపోచమ్మ దేవాలయంలో రోజువారికూలీగా పనిచేస్తుంటాడు. పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి అభినవ్ మురికికాలువలో పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈవిషయం గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో మండేపల్లి వాసి మృతి



తిరుపతి(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన జడల తిరుపతి(58) మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం... సిద్దిపేటలో బంధువులు మృతిచెందగా పరామర్శకు జడల తిరుపతి-రజిత దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రజిత తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లచ్చవ్వ(ఫైల్)

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన పున్న లచ్చవ్వ(59)అనే మహిళ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పున్న లచ్చవ్వ తన తల్లితో కలిసి పోతారంలో తమ్ముడి ఇంట్లో ఉంటోంది. మంగళవారం సాయంత్రం ఇంటిముందు గడ్డిని కాలుస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. దీంతో చికిత్సకోసం జగిత్యాలఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం రాత్రి మృతిచెందినట్లు మృతురాలి సోదరుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరండాలోనే శిశువు మృతదేహం

● మానవత్వం మరిచిన ఆసుపత్రి సిబ్బంది

కళ్యాణ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భంలో మృతి చెందిన శిశువును వరండాలో రాత్రి నుంచి ఉదయం వరకు ఉంచడంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తెలియక ఇబ్బందులకు గురయ్యారు. గోదావరిఖని ప్రభుత్వఆసుపత్రికి ప్రసవంకోసం మంథనికిచెందిన ఓగర్భిణి బుధవారం ఆసుపత్రిలో చేరింది. కడుపులోనే బిడ్డ అడ్డం తిరిగి మృతిచెందడంతో ఆమె భర్తకు శిశువును అప్పగించి ఆసుపత్రి సిబ్బంది చేతులు దులుపుకున్నారు. శిశువును ఏం చేయాలో అర్థంకాక లేబర్‌రూమ్ వద్ద పెయిడ్‌రూమ్‌ల వద్ద ఆ శిశువును ఉదయం 11గంటలవరకు అక్కడేఉంచారు. వాస్తవానికి శిశువు మరణించిన తరువాత కుటుంబ సభ్యుల అభిప్రాయం మేరకు ఆసుపత్రి సిబ్బంది ఖననం చేస్తారు. కానీ సిబ్బంది పట్టించుకోకుండా ఓ కాటన్ డబ్బాలో పెట్టి ఇవ్వడంతో ఏమి చేయలేక ఆ శిశువును మూలన పెట్టి ఉదయం వరకు జాగరణచేశారు. మృతిచెందిన శిశువును ప్యాకింగ్‌చేసి ఊరు చివరలో వైద్యసిబ్బంది ఖననం చేయాల్సి ఉంటుంది. శిశువును కాటన్ డబ్బాలో పెట్టి ఏమితెలియక గర్భిణి భర్త ఆసుపత్రి చుట్టూ తిరిగాడు. ఉదయం 11గంటలకు అక్కడున్నకొంతమంది శిశువు మృతదేహాన్ని చూసి వైద్యసిబ్బందిని ప్రశ్నించడంతో హడావిడిగా ఖననంచేశారు. ఆసుపత్రి సిబ్బంది ఇలా మానవత్వం మరవడంపై అక్కడున్నవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పునుకప్పిపుచ్చుకోవడానికి సిబ్బందినానాతంటాలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో గల మారుతీ టౌన్‌షిప్ వద్ద ఎదురెదురుగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికిగాయాలు అయ్యాయి. కోరుట్లకు చెందిన మనికంఠ, మకరంథ్ ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా టౌన్‌షిప్ ప్రాంతంలో ఎదురుగా కరీంనగర్ వైపు వస్తున్నకారు ఢీకొంది. దీంతో మనికంఠకాలుకు, మకరంథ్‌కు తీవ్ర గాయాలుకాగా చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీకి చెందిన బోగ మధుసూధన్ అనేవ్యక్తి నెల రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగిత్యాలలోని ఓరైస్‌మిల్లులో పనిచేసే మధుసూధన్ గతనెల 8న పనికి వెళ్తున్నాననిచెప్పి ఇంటినుంచివెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ



లాకర్‌ను, హుండీని ధ్వంసం చేసిన దొంగలు

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ముదిరాజ్ సంఘ నాయకులు తెలిపారు. ఆలయంలోని ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఆలయంలో ఉన్న వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండి, లాకర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. హుండీలో సుమారుగా రూ.5వేల వరకు నగదు ఉంటుందని వారు తెలిపారు. సంఘ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైపాస్ ఫ్లైఓవర్ గోడ ధ్వంసం



ధ్వంసమైన గోడ

కరీంనగర్ క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో గ్రానైట్‌లారీ అదుపుతప్పి ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టడంతో లారీలో ఉన్న భారీ గ్రానైట్‌రాయి ఫ్లైఓవర్ గోడకు తాకడంతో గోడ ధ్వంసమైంది. గురువారం రాత్రి 7గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తానాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ అదుపుతప్పటంతో పెద్ద బండరాయి ఫ్లైఓవర్ గోడను ఢీకొంది. దీంతో గోడకు పెద్ద రంధ్రం ఏర్పడి ధ్వంసమైంది. ఫ్లైఓవర్ గోడకు పెద్దరంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ కల్లూరి బాలరాజుపై దాడి చేసిన నిందితుడు పిట్ల శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై సిరిసిల్ల అశోక్‌లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు బయలుదేరింది. వల్లంపట్ల గ్రామసమీపంలో ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఇవ్వలేదని సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గంగాపూర్‌కు చెందిన శ్రీకాంత్ కారు కొంత దూరం వెళ్లిన తర్వాత తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు ఎదురుగా నిలిపాడు. డ్రైవర్ బాలరాజును దుర్భాషలాడి, బస్సు క్యాబిన్‌లోకి వచ్చి డ్రైవర్‌పై దాడిచేశాడు. బస్సు అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా అద్దం పగిలి రోడ్డుపక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సంది వజ్రవ్వకు తగిలింది. ఘటనను ప్రశ్నించిన ఒబులాపూర్ గ్రామానికి చెందిన బత్తుల రాజవ్వ అనే ప్రయాణికురాలితో శ్రీకాంత్ వాగ్వాదానికి దిగాడు. బస్సులో జరిగిన ఘటనను బస్సు మహిళా కండక్టర్ కాళేశ్వరి తన మొబైల్‌ఫోన్‌లో వీడియో తీసింది. వీడియో సోషల్ మీడియాల్ వైరల్ కావడంతో నిందితుడు పరారయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు అయ్యింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో మూడు టీంలు ఏర్పాటు అయ్యి, సాంకేతిక ఆధారంగా గురువారం రహీంఖాన్‌పేట గ్రామసమీపంలో నిందితున్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ వద్ద పాతయంత్రాల తరలింపు వివాదం

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణ కాంట్రాక్టు పనులు నిర్వహించిన సింప్లెక్స్ సంస్థ తన యంత్ర సామాగ్రిని తరలించే విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ బయట ఉన్న ఈ సామాగ్రిని తరలిస్తుండగా ఆర్ఎఫ్‌సీఎల్ సామాగ్రి ఉందంటూ కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో తరలింపును నిలిపివేశారు. రెండు నెలల క్రితం ట్రాన్స్‌పోర్టర్ విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు మాత్రం ఆసామాగ్రికి, మాకుసంబంధం లేదని పేర్కొంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ గ్రామానికి ఇసుకను ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్

● జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఉత్తర్వులు

హుజూరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీఈవో ఉత్తర్వులు జారీచేశారు. హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం అయిలయ్య విధులకు సక్రమంగా నిర్వహించడం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకో వడం లేదనే ఫిర్యాదులు అందాయి. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, ఏ సమ్మయ్యలు మద్యం తాగి పాఠశాలకు హాజరైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన డీఈవో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నివేదిక అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డివిజన్‌లోని సైదాపూర్, శంకరపట్నం, జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి.

జాతీయ స్కౌట్స్, గైడ్స్ క్యాంప్‌నకు ఖని విద్యార్థులు



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

కోల్‌సిటీటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈనెల 25నుంచి 29వరకు జరగనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో పాల్గొనడానికి ఖని విద్యార్థులు గురువారం తరలివెళ్లారు. 8మంది స్కౌట్స్, 8మంది గైడ్స్, గైడ్ కెప్టెన్ విజయ, స్కౌట్ మాస్టర్ రవీందర్‌ల ఆధ్వర్యంలో శ్రీరామ విద్యానికేతన్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ సుల్తానాబాద్ విద్యార్థుల బృందం వెళ్లారు. రామగుండం ఎంఈవో జింక మల్లేశం జెండా ఊపి విద్యార్థుల వాహనాన్ని ప్రారంభించారు.

బీజేపీలో విభేదాలు లేవు

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీలో విభేదాలు లేవని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీలోనైనా అంతర్గత విభేదాలు సహజమని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అందరం కలిసి పెద్ద మొత్తంలో స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. హుజూరాబాద్‌లో జరిగే కార్యక్రమాలపై తనకు సమాచారం ఉందని, తన వ్యక్తిగత కారణాలతోనే రాలేక పోయానన్నారు. బీజేపీ నాయకుల మధ్య గ్యాప్ ఉందన్నదని సోషల్ మీడియా సృష్టి మాత్రమే అన్నారు. మావోయిస్టుల లొంగుబాటు, ఎన్‌కౌంటర్లపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్టాండే తమ స్టాండ్ అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీల్లో పాలకులు లేక అభివృద్ధి కుంటుపడి పోయిందన్నారు. 25 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి పెద్ద ఎత్తున సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను గెలిపించుకుంటామన్నారు.

● గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

జమ్మికుంట రూరల్: గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేక రెండేళ్లు అవుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. 25ఏళ్లుగా ఇక్కడి ప్రజలతో అనుబంధం ఉందన్నారు. త్వరలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు సన్న వడ్లకు బోనస్ ఇచ్చి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఫామ్‌లతో సంబంధం లేకుండా ప్రజలమధ్యలో ఉండి ప్రజలు మెచ్చిన నచ్చిన వాళ్లను గెలిపించుకుంటామన్నారు. ఇకనుంచి నియోజకవర్గంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగెశోభ, ఎరబెల్లి సంపత్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు

● హాజరైన 130 మంది క్రీడాకారులు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 రెజ్లింగ్‌పోటీలకు విశేషస్పందన లభించింది. జిల్లాకేంద్రంలోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో నిర్వహించిన ఈపోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 100మంది బాలురు, 30మంది బాలికలు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, ఉమ్మడిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రెజ్లింగ్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చాటారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా క్రీడాకారులు ఎదగాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాజట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్, పోటీల కన్వీనర్ బి సత్యనారాయణ, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు సఫియా, ఎన్ శ్యామలదేవి, రెజ్లింగ్ కోచ్‌లు వంశీకృష్ణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కష్టాలు తీరేదెప్పుడో..?



చిత్రవేణిగూడె వెళ్లే రోడ్డు

● చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాలకు నడవని బస్సులు
● ఎటు వెళ్లాలన్నా మైళ్ల దూరం నడవాల్సిందే
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వృద్ధులు

బీర్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలాలు మారినా, ప్రభుత్వాలు మారినా గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీర్‌పూర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలు ఎటు ప్రయాణం చేయా లన్నా మైళ్ల దూరం కాలినడకన వచ్చి ఆర్టీసీ బస్సు ఎక్కాల్సిందే. ఒకప్పుడు చిత్రవేణిగూడెం గ్రామం తాళ్లధర్మారానికి అనుబంధ గ్రామంగా, చిన్నకొల్వాయి గ్రామం కొల్వాయికి అనుబంధంగా ఉండేవి. నూతన పంచా యతీలు ఏర్పడిన తర్వాత చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి గ్రామాలు జీపీలుగా ఏర్పడినా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు.

నాలుగు కి.మీ.లు నడిస్తేనే బస్సు

చిత్రవేణిగూడెం గ్రామ ప్రజలు ఏదైనా పని నిమిత్తం బీర్‌పూర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 10 కి.మీ.లు ప్రయాణించాలి. బస్సు సౌకర్యం లేక చిత్రవేణిగూడెం ప్రజలు బీఆర్‌పూర్ వెళ్లాలంటే 4 కి.మీ. కాలినడకన తాళ్లధర్మారం వరకు రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బీఆర్‌పూర్‌కు బస్సులో వెళ్తారు. చిత్రవేణిగూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులను చూసేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఆయా ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తుంటారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తాళ్ళధర్మారం గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద దిగి చిత్రవేణిగూడెంకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులు రావడం లేదని గిరి జనులు పేర్కొంటున్నారు.

మండలంలోని కొల్వాయి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నకొల్వాయికి కూడా బస్సు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులు చిన్న కొల్వాయికి వెళ్లాలంటే కొల్వాయి నుంచి మైళ్ల దూరం నడవాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనుబంధ గ్రామాల ప్రజలకు సైతం బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి
: కోట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



ప్రతి పనికి కొల్వాయి వెళ్లాలి. ఏదైనా ఊరికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. చిన్నపిల్లలు, వృద్ధులు నడవడం చాలా ఇబ్బంది అవుతుంది. సార్లు మా బాధలు పట్టించుకోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చిన్నకొల్వాయికి బస్సు సౌకర్యం కల్పించాలి.



చిన్న కొల్వాయికి వెళ్లే రోడ్డు

ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం
చిక్రం మారుతి, చిత్రవేణిగూడెం



గ్రామస్థులు ఏదైనా గ్రామం వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. గ్రామంలోని 35మంది బాలికలు చదువుకోవడానికి నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన తాళ్ళధర్మారం గ్రామానికి వచ్చి చదువుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామస్థుల సమస్య తీర్చాలి.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జడ్పీ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో ఈనెల 22నుంచి జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడిజిల్లా జట్టులోకి విద్యార్థులు టి తరుణ్, యు వినీత్, సీహెచ్ కృష్ణ, పి అక్షయ, బి శ్రీదేవి ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎండి జలీల్ తెలిపారు. ఈనెల12న జగిత్యాలలో జరిగిన ఉమ్మడిజిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

23న ఉమ్మడి జిల్లా సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి కరీంనగర్ జిల్లాసీనియర్స్ మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలనుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే ఉమ్మడిజిల్లా జట్లకుఎంపిక చేయనున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌యూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకామ్ (సీఏ), ఎంకామ్ (బ్యాంకింగ్ ఇన్సూరెన్స్), ఎంకామ్, సీఏ (ఎఫ్ఏ) కోర్సులకు మూడవ సెమిస్టర్ పరీక్షఫీజు షెడ్యూల్‌ను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి డి.సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబర్‌లో జరుగుతాయని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి

● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల్లో ఫేస్‌రికగ్నిషన్ తప్పనిసరి అని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ,పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, సెక్రెటరీలు, కరస్పాండెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు అన్ని కళాశాలల్లో విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని అన్నారు. విశ్వవిద్యాలయ ఆవరణలోని అన్నికళాశాలల్లో విద్యార్థులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి ఫేస్‌రికగ్నిషన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్యరవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫేస్‌రికగ్నిషన్ వలన క్రమశిక్షణ అలవడి కళాశాలకు క్రమం తప్పకుండా వస్తారని ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్, ఓఎస్డీ టు వీసీ డాక్టర్ బి హరికాంత్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

అజ్ఞానపు చీకట్లను పారదోలేదే దీపం..

● హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి ● గంగమ్మకు దీప హారతి



హారతి ఇస్తున్న విద్యారణ్యభారతీ స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానపు చీకట్లను దూరం చేసి జ్ఞాన జ్యోతులను నింపేదే దీపం అని హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు వద్ద హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి హాజరై గంగమ్మకు దీపార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. నిత్యం ప్రతి ఇంట్లో ఉదయం, సాయంత్రం సమయంలో దీపారాధన చేస్తే శుభప్రదమన్నారు. ఏ కార్యం చేపట్టిన జ్యోతిని వెలిగించే గొప్పదనం హిందూ సంస్కృతిదని అన్నారు. దీపం వెలిగిస్తే మనిషిలోని అహం అంతమై కాంతుల్లో ఆశలు చిగురిస్తాయని అన్నారు. నిత్యం దీపాన్ని ఆరాధిస్తే జ్ఞానం, సంపద సమకూరుతుందన్నారు. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి నీటిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో వేదపండితులు రాచర్ల రఘురామశర్మ, రాచర్ల విశ్వనాథశర్మ, ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

వైభవంగా దీపోత్సవం

● కార్తీకమాస ముగింపు సందర్భంగా ధర్మపురి,వేములవాడల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ధర్మపురిలో దీపోత్సవం కార్యక్రమం



కార్తీక మాసం ముగింపు హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోదావరి నదీతీరాన అనంత దీపోత్సవం కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నదీతీరాన శివలింగానికి రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. నదీతీరాన గల స్నానఘట్టాల మెట్లపైన ప్రత్యేకంగా దీపాలు ఏర్పాటు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నదిలో దీపాలు వదిలి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్ర మంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మపురి సీఐరాంనర్సింహారెడ్డి, శారదా మహిళామండలి, వాసవి మహిళామండలిసభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపుసభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లిసేవాగ్రూపు సభ్యులు, స్థానికమహిళలు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.



వేములవాడలో భీమన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భీమన్న సన్నిధిలో కార్తీక వేడుకలు

వేములవాడ టౌన్: వేములవాడ భీమేశ్వరాలయంలో కార్తీక వేడుకలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజున ఆలయఈవో రమాదేవి కార్తీకదీపాలను వెలిగించి ప్రారంభించగా, సుహాసినులు, భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. సుహాసినులకు వాయినం ఇచ్చి పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులతోపాటు స్వామివారి ఫోటోను ఈవో అంద జేశారు. దీంతో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.

ఉత్తమ సహకార సంఘంగా సుల్తానాబాద్ సొసైటీ



అవార్డు అందుకుంటున్న సుల్తానాబాద్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల వారోత్సవాలను పురస్కరించుకొని సుల్తానాబాద్ సహకారసంఘాన్ని ఉత్తమ సంఘంగా ఎంపికచేశారు. గురువారం హైదరాబాద్ జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో సొసైటీచైర్మన్ శ్రీగిరిశ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ చైర్మన్ అవార్డులను ప్రదానం చేశారు. సహకారసంఘాల సమాఖ్య మాజీజాతీయ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు చేతులమీదుగా శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యుల సహకారం, సంఘంపై విశ్వాసం వల్లే విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కేడీసీసీబ్యాంక్ అధ్యక్షుడు రవీందర్‌రావు, అధికారులు, పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి..

ఎల్లారెడ్డిపేట: సహకారసంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు లాభాల బాటలోకి తీసుకురావడానికి విశేషకృషి చేసిన ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సహకార ఉత్తమ ప్రదర్శన అవార్డును అందుకున్నారు. తెలంగాణ సహకార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సహకార సంఘ భవనంలో నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా గురువారం అవార్డుల ప్రధానోత్సవకార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమసేవలు అందించినందుకు కృష్ణారెడ్డి నాఫ్‌స్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకోవడంపై ప్యాక్స్ డైరెక్టర్లు, రైతులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం స్వల్పంగా నీరు వచ్చి చేరుతోంది. ఎగువప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 9,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీకాలువ ద్వారా 650క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

షార్ట్‌సర్క్యూట్‌తో హార్వెస్టర్‌లో మంటలు

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

జగిత్యాలరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసగ్రామంలో గురువారం వరికోస్తుండగా హార్వెస్టర్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్‌వెంటనే కిందకి దూకి ఫైర్‌సిబ్బందికి ఫోన్‌చేశారు. తక్షణమే స్పందించిన ఫైర్‌సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదంతప్పింది. ఈప్రమాదంలో హార్వెస్టర్ యజమానికి సుమారు రూ.5లక్షలు నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో కృష్ణకాంత్, ఏఎల్ఎఫ్ఎఫ్ వెంకటేశ్వర్లు, ఆపరేటర్లు మల్లేశం, ప్రణయ్, ఫైర్‌ఫైటర్స్ భాస్కర్, రాజేందర్, గంగేష్ పాల్గొన్నారు.



హార్వెస్టర్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

నేటి నుంచి అయ్యప్ప ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

కరీంనగర్ టౌన్/తిమ్మాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 21,22,23వ తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతిస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని దేవాలయ కమిటీ వారు పేర్కొన్నారు.

దేశంలో హింసాత్మక పాలన

హుజూరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆరు నెలల నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం మోదీ, అమిత్ షాలు హింసాత్మక పాలన చేస్తున్నారని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జీ టి సంపత్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టు నేత హిడ్మాది బుటకపు ఎన్‌కౌంటర్ అన్నారు.

సైనిక్ స్కూల్‌లో పుస్తక ప్రదర్శన

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, స్టోరీ రైటింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ వి లింగయ్య బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, ప్రమోద్ రాజు, లైబ్రేరియన్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పురుషుల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్ తెలిపారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఈ నెల 28 నుంచి 30 వరకు ఆదిలాబాద్‌లో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులు 27న ఉదయం 10 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో నిర్వాహకులు అంజనసాయి వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు.

అర్చక పోస్టు భర్తీకి ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భారత్ టాకీస్ రోడ్ వీరాంజనేయస్వామి దేవాలయంలో శ్రీవైష్ణవ సంప్రదాయ వైఖానస ఆగమ అర్చకుని పోస్టు భర్తీకి దరఖాస్తు కోరుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సూచించినట్లు ఆలయ ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు డిసెంబరు 5వ తేదీలోపు దరఖాస్తు ఆలయ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

23న జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో పోటీలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జమాతే ఇస్లామి హింద్ తూర్పు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, వీడియో మేకింగ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేయనున్నట్లు విభాగ అధ్యక్షుడు ముజమ్మిల్ ఇర్ఫాన్ తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు


సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గణేష్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పేపర్ లీక్ కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను నిర్దోశిగా హైకోర్టు తేల్చి చెప్పిందని బీజేపీ నాయకులు మాజీ మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీజేపీ శ్రేణులు తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, ఎండి ముజీబ్, రాపర్తి ప్రసాద్, కొలగాని శ్రీనివాస్, వంగల పవన్, బండ రమణారెడ్డి, లెక్కల వేణుగోపాల్, బండారు గాయత్రి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గేట్ వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అతని వయస్సు 50-55 వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుడిని గుర్తించినవారు వెంటనే వన్‌టౌన్ పోలీసులు ఫోన్: 8712670761, 8331940591లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

కూలీ మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హనుమాన్‌నగర్‌లోని ఒక ఇంటిలో సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన పొన్నాల బాలరాజు(55) అనే కూలీ మృతిచెందాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. 10 సంవత్సరాల క్రితం భార్య మృతిచెందడంతో బాలరాజు ఒంటరిగా హనుమాన్‌నగర్‌లోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ విద్యానగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రోడ్డుపై ఆగి ఉన్న కారును అతివేగంగా బైకు ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కేటీఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పటిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్ములా ఈ-రేసును విజయవంతంగా నిర్వహించేందుకు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పారదర్శకంగా ఉన్నాయన్నారు.

రోడ్డు పక్కన అనుమానాస్పదంగా బైక్


అనుమానాస్పదంగా ఉన్న బైక్

సైదాపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్ గుట్ట సమీపంలో గొల్లగూడెం రోడ్డులో గుట్ట మూలమలుపు నుంచి కొద్ది దూరంలో 20 రోజులుగా ఓ బైక్ అనుమానాస్పదంగా ఉన్నది. ఏపీ37ఏ5141 నెంబరు గల బైక్ అక్కడ ఎందుకు పెట్టారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి ఆ బైక్ ఎవరిదో గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై పశువులు తిరిగితే చర్యలు

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై పశువులు కనిపిస్తే సంబంధిత పశువుల యజమానులపై చర్యలతో పాటు జరిమానా విధిస్తామని మున్సిపల్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ వై.దుర్గాప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం భాగ్యనగర్‌లో 13 ఆవుల యజమానులకు జరిమానా విధించినట్లు తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి


సహకార జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ బాశవేణి మల్లేశం యాదవ్ పేర్కొన్నారు. గురువారం పద్మనగర్ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా యూనియన్ కార్యాలయంలో సహకార జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సహకార సంఘాలు ఏర్పాటు చేసి 72 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వారోత్సవాలను ఘనంగా నిర్వహించామని అన్నారు. జిల్లాస్థాయిలో గ్రామ గొర్రెల పెంపకందారుల సంఘాలు గ్రామగ్రామాన ఉన్న సమస్యలను జిల్లా కార్యవర్గం దృష్టికి తీసుకువస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు మావంతు కృషిచేస్తామని అన్నారు. నాబార్డు, ఎన్‌సీడీసీ ద్వారా నిధులతో సహకార సంఘాలు బలోపేతం చేయబడ్డాయని అన్నారు. సహకార సంఘాలు బలోపేతంతో సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు నూతన ఆధునిక పద్ధతులను అవలభించాలన్నారు. అనంతరం కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీర్ల బీరయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర నాయకులు కాల్వ మల్లేశం యాదవ్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పాలె శ్రీనివాస్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు దుబ్బాసి చందు, నూతనంగా ఎన్నికైన జిల్లా చైర్మన్ బాశవేణి మల్లేశం యాదవ్‌ను, నూతన డైరెక్టర్లు కటికరెడ్డి బుచ్చన్న, దానె ఓదెలు, ముక్కెర సదానందం, బద్దుల రాజ్‌కుమార్, దాడి ఆంజనేయులు, గడ్డి శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుకుట్ల సంతోష్, జిట్టవేణి పర్శరాములు, అవురగొని శ్రీహరి పాల్గొన్నారు.

శిల్ప కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రామడుగు మండలంలోగల శిల్ప కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ జాగృతి ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం, వర్క్‌షాపులు, మార్కెటింగ్, ఎగుమతి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా ప్రధానకార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు చంటి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక బోధన విద్యార్థులకు ఉపయోగకరం


విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకత, ప్రయోగాత్మకత బోధన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో నిర్వహించిన అల్ఫోర్స్ ఇంటలిజెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో పాఠ్యాంశ ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలను రూపొందిస్తూ అమలుపరుస్తున్నామని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాలను నేడు పాఠశాలలో వేడుకగా ప్రారంభించామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గ్రామర్ సిటీ, ఆదర్శ నీయమైన కథలు, మ్యాథ్స్ మానియా, ఆరోగ్యకరమైన ఆహారం-జంక్ ఫుడ్స్, వాటర్‌సైకిల్, వంట చేసే విధానాలు, అగ్నిపర్వతాల ప్రభావం, గ్రహణం, సునామీ, దేశంలోని విద్యా విధానాలు, ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఏర్పాటు చేసిన పలు సమాచార పట్టికలు ఆలోచింపచేశాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో నల్లాల సర్వే

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలని చెబుతున్నారు. గతంలో పాసుబుక్కులను ఇవ్వడంతోనే బిల్లులు చెల్లించామని, ఇప్పుడు వాటిని పరిగణలోకి తీసుకోకుండా బకాయిలన్ని కట్టాలనడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రికార్డులు లేవని, అక్రమ నల్లాలుగా గుర్తించామని సక్రమం చేసుకోవాలంటూ వేలల్లో ఖర్చు అవుతుందంటూ కిందిస్థాయి ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకోవైపు కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లకు కనెక్షన్లు ఇచ్చినట్లు తేలుతున్నట్లు చెబుతున్నారు. మొత్తంగా నల్లాల సర్వే కలకలం రేపుతోంది.

ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలి

- డీఏవో భాగ్యలక్ష్మి

ఇల్లందకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పకుండా రసీదు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మన్నపల్లి, కనగర్తి, సిరిసేడు గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు.

స్వయంపాలన దినోత్సవం

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ దీక్షితులు, ఉపాధ్యాయులు లక్ష్మణ్ కుమార్, రాజమౌళి పాల్గొన్నారు.

బీసీలకు బడ్జెట్ ఇవ్వకుండా మోసం చేసిన బీఆర్ఎస్

సుభాష్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం 11 బీసీ కులాల ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు బడ్జెట్ ఇవ్వకుండా మోసం చేసిందని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొవిటి సదానందచారి ఆరోపించారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ఫెడరేషన్, కార్పొరేషన్లు, కోఆపరేటివ్ సొసైటీలకు 10 లక్షల సబ్సిడీ ఇస్తామని ఎన్నికల మెనిఫేస్టోలో పేర్కొని పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో అలిరెడ్డి చంద్రమౌళి, కాసుల కిరణ్ కుమార్, గైని లక్ష్మి, రవీందర్‌రాజ, పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కరీంనగర్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల బాలురు-1లో విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


సీఎంఆర్ఎఫ్ చెక్ పంపిణీ చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొంది అర్హత కలిగిన వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో 18 మందికి మొత్తం కలిపి 6 లక్షల 70 వేల రూపాయల చెక్‌లు పంపిణీ చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పటి వరకు 846 మందిని నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా ఆదుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కొట్టె ప్రభాకర్, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

సెల్ టవర్ ఏర్పాటు విరమించుకోవాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని 14వ డివిజన్ శివనగర్‌లో సెల్‌టవర్ పనులను వెంటనే నిలిపివేయాలని నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక ప్రజలు గురువారం దర్నాకు దిగారు. టవర్ ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు పోలీస్ ప్రొటెక్షన్‌తో పనులు నిర్వహించేందుకు రావడంతో మహిళలు వాగ్వాదానికి దిగారు. పోలీసులు, స్థానిక మాజీ కార్పొరేటర్ దిండిగాల మహేష్ సర్దిచెప్పటంతో శుక్రవారం అందరూ కలిసి మాట్లాడుకునేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

గన్నేరువరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కానుకగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పదో తరగతి విద్యార్థులకు అందజేస్తున్న సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 55మంది విద్యార్థులకు, జంగపల్లి జెడ్పీ హైస్కూల్‌లోని 48 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, బీజెపి నాయకులు సొల్లు అజయ్‌వర్మ, ముత్యాల జగన్‌రెడ్డి, చంద్రారెడ్డి, రామచంద్రం, రాము ఉన్నారు.

● న్యూస్‌బాక్స్

గన్నేరువరం: చీమలకుంటపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన దోపాట రాజేశ్వరరావు, బామండ్ల రాజవ్వల కుటుంబాలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి గురువారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేశారు.

భగత్‌నగర్ : గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను నగరంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల రాజుగౌడ ఆవిష్కరించారు.

వీణవంక: మండలంలోని చల్లూరు ,ఎల్బాక, గంగారం,హిమ్మత్‌నగర్‌తో పాటు పలు గ్రామల్లో ఇటీవల మరణించిన కుటుంబాలను మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, నాయకులు ఎనగంటి శ్రీనివాస్, గాలేటి సురేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మోటం వెంకటేష్ ఉన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ హనుమాన్‌నగర్‌లోని వసంత్‌వ్యాలీ పాఠశాల విద్యార్థి ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు వసంత్‌వ్యాలీ పాఠశాల చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు.

భగత్‌నగర్:: జిల్లా స్థాయి గ్రంథాలయ వారోత్సవాల్లో పారడైజ్ విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు గెలుచుకున్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి విద్యార్థులను అభినందించారు.

కరీంనగర్ కల్చరల్: పాతబజార్ గౌరీశంకరాలయంలో కార్తీక అమావాస్య సందర్భంగా పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సామూహిక సౌందర్య లహరి పారాయణం నిర్వహించారు.

శ్రీ చైతన్యలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

తిమ్మాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో 64వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఫార్మసీ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణపై విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన అవిష్కరణలపై అవగాహన కలుగుతుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ కె.నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, ప్రసాద్ రాజు, రామనర్సింహరెడ్డి, హెచ్ఓడిలు రవీందర్, చంద్రమౌళి, అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదకాలువ భూమిలో సాగు

గంగాధర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల పరిధిలోని పలు చోట్ల వరద కాలువ గట్టును చదును చేసి పంటలు సాగు చేస్తున్నా నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల రైతులు వాపోతున్నారు. గంగాధర మండలం తాడిజెర్రి నుంచి ఆచంపల్లి వరకు అదనపు టీఎంసీలో భూములు పోగా నష్టపరిహారం తీసుకున్నారు. తాడిజెర్రి నుంచి ఆచంపల్లి వరకు రైతులు పొలాలకు పోవడానికి ప్రభుత్వం దారి ఏర్పాటు చేసింది. ఈ దారిని కొందరు రైతులు కబ్జా చేసి సాగు చేస్తున్నారని తాడిజెర్రి గ్రామానికి చెందిన శ్రీరాం తిరుపతి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని ఆయన వినతిపత్రంలో విన్నవించారు. ఆచంపల్లి వరదకాలువ వద్ద కొందరు రైతులు కట్టను చదును చేసిసాగు చేస్తున్నారు. కాలువకు భూమిలివ్వగా ప్రభుత్వం రైతులకు పరిహారం అందించింది. అయినా కొందరు కాలువ భూమిలో సాగుచేస్తున్నా నీటిపా రుదలశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పైల్స్‌కు అందుబాటులో అత్యాధునిక చికిత్స


వైద్యం అందిస్తున్న డాక్టర్ సురేష్

సుభాష్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పైల్స్ అనేది నయం కాని జబ్బు కాదని, దీనికి అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందని డాక్టర్ తాటిపాముల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సుభాష్‌నగర్‌లోగల పైల్స్ అండ్ మోర్ క్లినిక్‌లో ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైల్స్‌తో దీర్ఘకాలికంగా బాధపడుతున్నవారు ప్రారంభ దశలో డాక్టర్‌ను సంప్రదిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. సాత్విక ఆహారం, పండ్లు, కూరగాయలు, తగినంత నీరు, నడక, సులభతర మైన వ్యాయామం చేయాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 80 మందికిపైగా పాల్గొనగా వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈవో డాక్టర్ పల్లవి, డాక్టర్ అశ్రిత్, లయన్స్‌క్లబ్ సెకండ్ వైస్ గవర్నర్ గుంటుక చంద్రప్రకాశ్, మానేరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకాచారి పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో పిల్లల గుర్తింపు

గంగాధర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలంలో వర్క్‌సైట్ పిల్లలను గుర్తించి స్కూల్లో చేర్పించడానికి సర్వే చేస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్‌రావు తెలిపారు. గురువారం గంగాధర మండలంలోని ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వారి పిల్లలను గుర్తించారు. ఇటుకబట్టీల్లో పనిచేయడానికి ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్ రాష్ట్రాల నుండి ఎక్కువగా వస్తుంటారు. వీరికి గట్టుబూత్కూర్‌లో వర్క్‌సైట్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమవుందని తెలిపారు. ఇప్పటి వరకు 30 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల పిల్లలను తప్పనిసరిగా స్కూల్లో చేర్పించాలని ఆయన సూచించారు.

ప్రతిరోజు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోండి


వినతిపత్రం ఇస్తున్న ఐలేందర్‌యాదవ్

కరీంనగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగిద్దెపెరుమాళ్ల స్వామి దేవాలయ రిజర్వాయర్ పరిధిలోని వినియోగదారులకు ప్రతిరోజు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్ మున్సిపల్ అధికారులను కోరారు. గురువారం ఆయన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని 9,10,11,31,32 డివిజన్ ప్రజలు ఎక్కువగా నల్లానీటిపైనే ఆధారపడతారని, బోరుబావులు లేక నీటి కోసం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీనితో వెంటనే కమిషనర్ స్పందించి డీఈ, ఏఈలకు రోజూ నీరు సరఫరా జరిగేలా చూడాలని ఆదేశాలిచ్చారని నీటి కష్టాలు తీరుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మంచినీటి కోసం బద్దిపల్లిలో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

భగత్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో మంచినీటి కోసం మహిళలు నిరసన చేపట్టారు. గ్రామంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, గ్రామ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తమ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులు పఠనాసక్తిని పెంచుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పఠనాసక్తిని పెంచుకోవాలని తెలంగాణ గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం వాల్మీకి ఉన్నత పాఠశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉపాధి కల్పనాధికారి ఎం అశోక్‌రావు, ఎల్ దేవేందర్‌రెడ్డి, హెచ్ఎం ముకుందరెడ్డి పాల్గొన్నారు.

చిన్న ఆసుపత్రులపై నియంత్రణ దెబ్బ

సుభాష్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు, అనుమతుల పేరిట అధికారుల వేధింపులతో చిన్న, మధ్యతరహా ఆసుపత్రులు మూసివేత దిశగా పయనిస్తున్నాయని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ)సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 30 పడకలలోపు ఆసుపత్రుల పరిస్థితిపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణకు సుమారు 20 విభాగాల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు తనిఖీలతో వేధిస్తున్నారని ఆరోపించారు.